

ప్రభుత్వానికి వ్యతిరేకంగా వన్‌సైడ్ వార్

2019 ఎన్నికల్లో ఏకపక్షంగానే వైసీపీకి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ఇప్పుడు సీన్ తారుమారైంది. ఒక్కసారి అధికారం ఇస్తే అణిచివేశారన్న కారణంతో ఇప్పుడు ఉద్యోగులు.. వైసీపీకి మరోచాన్స్ ఇవ్వకూడదని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. వార్ వన్‌సైడ్ మాదిరి అధికశాతం మంది ఉద్యోగులు ఎన్డీయే కూటమికి ఓటేశారనే ప్రచారం సాగుతోంది. 'జగన్ సర్కారు ఉద్యోగులను ముప్పుతిప్పలు పెట్టింది.. అందుకు తగిన ప్రతిఫలం ఇప్పుడు మేం ఓట్ల రూపంలో చూపాం' అని కొంతమంది ఉద్యోగులు పరోక్షంగా వెల్లడిస్తున్నారు. ఉద్యోగుల ఓట్లు.. ఈసారి వ్యతిరేకంగా పోలయ్యే అవకాశముందని వైసీపీ ముందే పసిగట్టేసింది. అందుకే ఓట్లను గల్లంతు చేయడం.. వేర్వేరు పోలింగ్ స్టేషన్లకు ఓటును బదిలీచేసి కొంతమేర గందరగోళం కలిగించేలా తెరవెనుక వ్యవహరించింది. అయినా ఉద్యోగులు ఏకతాటిపైకి వచ్చారు. ఓట్లు గల్లంతైనా.. గంటల సేపు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఆలస్యమైనా సరే ఓటు వేశారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో నరసన్నపేటలో కాస్త గందరగోళమైంది. కలెక్టర్ కూడా అక్కడే మాటువేసి పోలింగ్‌ను పరిశీలించారు. నిర్లక్ష్యం చూపిన ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులను కూడా జారీచేశారు. ఏదిఏమైనా ఈ సారి పోస్టల్‌బ్యాలెట్ ద్వారా వైసీపీకి ఝలక్ తప్పదని పలువురు పేర్కొంటున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై వైసీపీలో కలవరం

- ఉద్యోగులంతా కూటమికే ఓటేశారని అనుమానం
- జగన్ పాలనలో ఉద్యోగుల అణచివేత
- ఉద్యమాలకూ అడ్డంకులే
- అందుకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు పడిందని ప్రచారం



(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల కోసం నిర్వహించిన పోస్టల్‌బ్యాలెట్‌పై వైసీపీ నేతల్లో కలవరం రేగుతోంది. వైసీపీ పాలనలో ఉద్యోగులంతా దారుణ అణచివేతకు గురి కాగా.. ఓట్ల రూపంలో వారంతా బదులు తీర్చుకున్నారని తెలుస్తోంది. ఈ నెల 4 నుంచి ప్రారంభమైన పోస్టల్‌బ్యాలెట్ ప్రక్రియ గురువారంతో ముగిసింది. కాగా.. అధికశాతం మంది ఉద్యోగులు వైసీపీని వ్యతిరేకిస్తూ.. ఎన్డీయే కూటమికి ఓటేశారని.. ప్రచారం సాగుతోంది. దీంతో తమ గెలుపు కష్టమేనని వైసీపీ అభ్యర్థుల్లో నిరాశ కనిపిస్తోంది. 'మేము అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తాం. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మరింత మేలు చేస్తా'మని గత ఎన్నికలకు ముందు పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వైసీపీ వైపు మొగ్గు చూపారు. కాగా.. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తయింది. కానీ, ఇంతవరకూ సీపీఎస్ రద్దు హామీ నెరవేర్చలేదు. మరోవైపు ఎన్నడూ లేనంతగా ఉద్యోగులను వంచనకు గురిచేశారు. హక్కులపై పోరాడితే.. ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధాల పేరిట అణచివేతకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు మారువేషాల్లో విజయవాడ వెళ్లి ప్రభుత్వంపై నిరసన తెలిపారు. అలాగే అంగన్‌వాడీల ఆందోళనలను కూడా ప్రభుత్వం బలవంతంగా అడ్డుకుంది. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభించలేదు. పీఆర్సీ సంగతే లేదు. ఆపై డీఏ బకాయిలు విడుదల కాలేదు. పీఎఫ్ డబ్బుల ఉపసంహరణ కూడా సక్రమంగా చెల్లించలేదు. ఉద్యోగుల యూనియన్లలో బలంగా ఉండేవి ఉపాధ్యాయ సంఘాలు మాత్రమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉపాధ్యాయుల పనితీరుపై నిఘాపెట్టి వారిని అణిచివేయాలని నిర్ణయించింది. ఇటు యాప్‌ల భారం, ఆపై మరుగుదొడ్లను ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలని చెప్పింది. బోధనేతర పనులను అప్పగించడం.. పరోక్షంగా విద్యా ప్రమాణాలు దెబ్బతీసేలా చర్యలు చేపట్టింది. దీంతో వైసీపీ ప్రభుత్వ తీరుపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలంతా గుర్రుగా ఉన్నాయి. ఈ క్రమంలో తమను ఇబ్బందులు పెట్టిన వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాయని తెలుస్తోంది.

శ్రీకాకుళంలో పోస్టల్ బ్యాలెట్ వద్ద బారులుదీరిన ఉద్యోగులు (ఫైల్)

పోలింగ్‌కు ముందు 48 గంటలు కీలకం

- ఎన్నికల పరిశీలకుడు శేఖర్ విద్యార్థి

కలెక్టరేట్, మే 9: సార్వత్రిక పోలింగ్‌కు ముందు 48గంటల(సైలెన్స్ పీరియడ్) కాలం అత్యంత కీలకమని ఎన్నికల పరిశీలకుడు శేఖర్ విద్యార్థి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్‌జిలానీ సమూన్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పోలింగ్‌కు మూడు రోజుల ముందు నుంచే మరింత అప్రమత్తంగా ఉండాలి. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసుకునేలా చర్యలు చేపట్టాలి. పోలింగ్‌కు ముందు 48 గంటల నుంచి ఎన్నికల ముగిసే వరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడం నిషేధం. ఐదుగురికి మించి ఒకచోట గుమికూడరాదు. అభ్యర్థుల ప్రచార ఖర్చుల రిజిస్టర్ల చివరి దశ తనిఖీలు పూర్తి చేయాల'ని ఆదేశించారు. కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ.. 'రాష్ట్ర, జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద మరింత నిఘా పెంచాలి. డబ్బు, మద్యం, కానుకల అక్రమ రవాణా అడ్డుకుని కేసులు నమోదు చేయాలి. ఓటర్లను ప్రలోభ పెట్టడం, వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించడం నేరం. అటు వంటి సంఘటనలపై తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలి. ఈ నెల 11, 12 తేదీల్లో రాత్రివేళల్లో ప్రత్యేక నిఘా పెట్టి, సి-విజిల్, 1950 ద్వారా వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి. పోలింగ్ కేంద్రాల సమీప ప్రాంతాల్లో ఎటువంటి ప్రచారం చేయరాదు., మీడియా ఫోటోలు తీయ రాదు' అని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు అబ్జర్వర్లు దిగంబర్ పి.ప్రధాన్, సత్యేంద్ర పటేల్, ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు సందీప్‌కుమార్(ఐఏఎస్), వ్యయ పరిశీలకులు శరవణ కుమార్, కోమల్జిత్ మీనా, నవీన్‌కుమార్ సోనీ, ఎస్పీ జీఆర్ రాధిక, ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో ఎం.గణపతిరావు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు శేఖర్ విద్యార్థి, పక్కన కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

ఎన్నికల విధులను సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, మే 9: ఎన్నికల విధులను సజావుగా నిర్వహించాలని, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. గురువారం తన చాంబర్ నుంచి ఎనిమిది నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో పీవోలు, ఏపీవోలదే కీలక పాత్ర అని, వారికి దిశానిర్దేశం చేయాలని ఆర్వోలను ఆదేశించారు. పోలింగ్ నిర్వహణపై.. ఈవీఎంలు మొరాయిస్తే ఏమి చేయాలనే దానిపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరన్నారు. ఈవీఎంలో ఓటు పడిన తర్వాత ఏదైనా సమస్య మొదలైతే రెండో ఈవీఎంను వినియోగించాలన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఆ రెండు ఈవీఎంలనూ రిసెప్షన్ కేంద్రంలో అప్పగించాలని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే సెక్టోరియల్ అధికారికి, ఏఆర్వోకు, ఆర్వోకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్వోలు నూరుల్ కమర్, భరత్‌నాయక్, సీహెచ్ రంగయ్య లక్ష్మణమూర్తి, రామ్మోహన్, సుదర్శన దొర, అప్పారావు పాల్గొన్నారు.

బిందెలు పట్టుకుని.. కొండలు ఎక్కి





- బకెట్, బిందెలతో నీటిని పట్టుకుని కొండ ఎక్కుతున్న ఈ మహిళలది మెళియాపుట్టి మండలంలోని గూడ గ్రామం. కొండపై ఉన్న ఈ గ్రామంలో సుమారు 23 ఇళ్లు 97 మంది మంది గిరిజనులు ఉన్నారు. గ్రామంలో తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. వేసవి వసే గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న బావి వద్దకు వెళ్లి నీటిని తోడుకుంటారు. నీటి పాత్రలను తలపై పెట్టుకుని కొండను ఎక్కాల్సి వస్తుందని మహిళలు వాపోతున్నారు.



- పిచ్చి మొక్కల మధ్య పడిఉన్న ఈ సోలార్ నీటి పథకాన్ని చూశారా! మెళియాపుట్టి మండలం జంతూరు గ్రామంలోని గిరిజనుల తాగునీటి కష్టాలను తీర్చేందుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. మూడేళ్ల క్రితం సోలార్ పలకలు విరిగిపోయి పథకం మూలకు చేరింది. దీంతో తాగునీరు అందక గ్రామంలోని 80 కుటుంబలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

- గిరిజనులంటే ఎందుకింత అలుసు
- కొండశిఖర గ్రామాల్లో తాగునీటి కష్టాలు
- పనిచేయని సోలార్ నీటి పథకాలు
- నిర్వహణను గాలికొదిలేసిన ప్రభుత్వం
- 2022లో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి
- ఆ తర్వాత పట్టించుకోని వైఎస్ జగన్

(మెళియాపుట్టి)

విద్యుత్ సౌకర్యం లేని మారుముల గిరిజన ప్రాంతాల్లో ప్రజల దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఆధారిత నీటి పథకాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని మెళియాపుట్టి, మందస, కొత్తూరు, హిరమండలం, పాతపట్నం, ఎల్.ఎన్‌పేట మండలాల్లో సుమారు 330 పథకాలను ఏర్పాటు చేశారు. ఒక్క ఎల్ఎన్‌పేట మండలంలోనే 75 పథకాలను ఏర్పాటు చేశారు. ఒక్కో నీటి పథకానికి రూ.3.80 లక్షలు వ్యయం చేశారు. బోర్లను తవ్వి వాటికి సోలార్ సిస్టం అమర్చడం ద్వారా ట్యాంకులకు తాగునీరు సరఫరా జరిగేది. దీంతో గిరిజనులకు నిత్యం తాగునీరు అందడంతో ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావు. అయితే, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకాలను పట్టించుకోవడం మానేసింది. నిర్వహణను గాలికి వదిలేయడంతో చాలా పథకాలు మూలకు చేరాయి. గాలులకు సోలార్ పలకలు విరిగిపోవడంతో ప్రస్తుతం 80 వరకు పనిచేయటం లేదు. ఇందులో మెళియాపుట్టి మండలంలోనే 40 పథకాలు ఉన్నాయి. దీంతో నీరు అందక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదేళ్లగా పథకాలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. పంచాయతీ నిధులతో బాగు చేద్దామన్నా నిధులు కరువయ్యాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీల ఖాతాలను ఖాళీ చేస్తుండడంతో రూపాయి కూడా ఉండడం లేదు. కనీసం మండల పరిషత్ నిధులు అయినా వినియోగించుకుందామన్నా అక్కడ కూడా ఇదే పరిస్థితి ఉండడంతో ఏమీ చేయలేక పోతున్నామని సర్పంచ్‌లు వాపోతు న్నారు. వాస్తవానికి ఈ పథకాల ఏర్పాటుకు టెండర్లు పొందిన కంపెనీయే ఐదేళ్ల పాటు వాటి బాగోగులను చూసుకుంది. అయితే, కంపెనీ గడువు తీరడంతో వాటిని విడిచిపెట్టింది. దీంతో ఈ పథకాల నిర్వహణను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులే చూసుకోవాలి. కానీ వారు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

హామీ మరిచిన సీఎం..

2022లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లాకు వచ్చినప్పుడు పాతపట్నం నియోజకవర్గానికి ఇంటింటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రూ.265 కోట్లతో హిరమండలంలోని వంశధార జలాశయం నుంచి పైపుల ద్వారా ప్రతి ఇంటికీ తాగు నీటిని సరఫరా చేస్తామని మాటిచ్చారు. అయితే ఎక్కడా పనులు జరిగిన పరిస్థితి లేదు. దీంతో వేసవిలో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మరోపక్క జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. అధికంగా గిరిజన గ్రామాల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

ఇబ్బందులు లేకుండా చూస్తాం

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూస్తున్నాం. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి. ప్రస్తుతం వేసవిలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తాం. అధికంగా జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటిని అందిస్తున్నాం.

-కళ్యాణ్ చక్రవర్తి, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్



దీనబంధుపురంలో జక్కర నీటి కోసం బాగుచేస్తున్న గిరిజనులు (ఫైల్)



కడపలగెడ్డ రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు (ఫైల్)


కడపలగెడ్డ బ్రిడ్జి.. కలేనా?

- శంకుస్థాపనలకే పరిమితం
- అమలుకాని హామీలు
- దశాబ్దాలుగా తీరని కష్టాలు

(ఎల్.ఎన్.పేట)

ఎల్.ఎన్.పేట మండలంలో తురకపేట, దబ్బపాడు గ్రామాల మధ్య కడపల గెడ్డపై బ్రిడ్జి నిర్మాణం కలగా మారింది. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమయ్యిందని, దశాబ్దాలుగా తమ కష్టాలు తీరడం లేదని దబ్బపాడు గ్రామస్థులు వాపోతున్నారు. ఏటా వర్షాకాలంలో మూడు నెలలపాటు ఈ రోడ్డు గుండా గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయని పేర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు బ్రిడ్జి నిర్మాణానికి హామీ ఇచ్చి తర్వాత మరచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా బ్రిడ్జి నిర్మాణానికి నోచుకోవడంలేదని వాపోతున్నారు. వర్షాకాలంలో వంశధారనదికి వరద పోటెత్తడంతో కడపలగెడ్డ రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తుంది. ఆ సమ యంలో గ్రామం నుంచి బయటకు వెళ్లడానికి అగచాట్లు తప్పడం లేదు. అత్యవసర సమయంలో పట్టణాలకు వెళ్లాలంటే వాడవలస, మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట మీదుగా నాలుగు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి లక్ష్మీనర్సు పేట జంక్షన్ వద్ద ప్రధాన రోడ్డుకు చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రెండేళ్ల కిందట స్థానిక ఎమ్మెల్యే రెడ్డిశాంతి కడపలగెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తరువాత కాంట్రాక్టరు బ్రిడ్జి పనులు ప్రారంభించి నిలిపివేశారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

ఓట్ల కోసం మోసం



ఎన్నికల సమయంలో ఓట్లు కోసం గ్రామానికి వచ్చే రాజకీయ నాయకులు బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చి.. మోసం చేస్తున్నారు. తురకపేట, దబ్బపాడు మధ్య కడపలగెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

- జె.మోహనరావు, మాజీ సర్పంచ్, దబ్బపాడు

ఎన్‌జీఆర్ పురానికి

కేంద్ర బలగాలు

- కూటమి అభ్యర్థిపై దాడితో పటిష్ఠ బందోబస్తు
- పోలీసులు రక్షణ కల్పించడం లేదు: ఎన్ఈఆర్

రణస్థలం, మే 9: ఎన్నికల వేళ.. రణస్థలం మండలం ఎన్‌జీఆర్‌పురం పంచాయతీలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. ఈ నేపథ్యంలో పోలీస్ పికెటింగ్ కొనసాగుతుండగా.. త్వరలో కేంద్ర బలగాల బందోబస్తు కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ పంచాయతీ పరిధిలోని చీకటిపేటలో రెండు వారాల కిందట వైసీపీ శ్రేణుల దాడిలో కూటమి మద్దతుదారులు ఇద్దరు గాయపడ్డారు. తాజాగా బుధవారం రాత్రి ఎన్‌జీఆర్‌పురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి(బీజేపీ) నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్)పై వైసీపీ శ్రేణులు రాళ్లదాడికి ప్రయత్నించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఎన్ఈఆర్ త్రుటిలో తప్పించుకోగా.. జనసేన కార్యకర్త గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో ఎన్‌జీఆర్‌పురంలో ప్రజలకు రక్షణ కల్పించడంలో యంత్రాంగం విఫలమైందని ఎన్ఈఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కొద్దిరోజులుగా పంచాయతీ పరిధిలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులపై విచక్షణరహితంగా దాడులు చేస్తున్నా.. పోలీసులు రక్షణ కల్పించడం లేదని ఆరోపించారు. ఓటమి భయంతోనే వైసీపీ ఇటువంటి దుశ్చర్యలకు దిగుతోందన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్‌తోపాటు కేంద్ర పెద్దలకు ఫిర్యాదు చేశామని తెలిపారు. పోలింగ్ వరకూ కేంద్ర బలగాలను కొనసాగించాలని కోరామని చెప్పారు. సీఐ రామచంద్రరావు బుధవారం అర్ధరాత్రి ఎన్‌జీఆర్ పురాన్ని సందర్శించారు. ఘటన సమయానికి ఈ పంచాయతీ పరిధి చీకటిపేటలో పోలీసు బలగాలు ఉన్నాయని చెప్పారు. గత 12రోజులుగా పంచాయతీ పరిధిలో పికెటింగ్ కొనసాగుతోందని తెలిపారు. కేంద్ర బలగాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని పోలింగ్ వరకూ పటిష్ఠ బందోబస్తు కొనసాగుతుందని చెప్పారు.



ఎన్‌జీఆర్ పురంలో పోలీస్ పికెట్



ఆదిత్యుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ఆరోగ్యప్రదాత.. అరసవల్లిలో శ్రీసూర్యనారాయణస్వామిని గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ ఇన్‌చార్జి సూప రింటెండెంట్ కృష్ణమాచార్యులు వారికి స్వామి జ్ఞాపికను అందజేశారు.

- అరసవల్లి

12, 13 తేదీల్లో మద్యం దుకాణాల మూసివేత

శ్రీకాకుళం క్రైం, మే 9: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 12, 13 తేదీల్లో మద్యం విక్రయాలు నిషేధించనున్నట్టు ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లు, బీర్ ఫ్యాక్టరీలకు 11న సాయంత్రం 6 గంటలకు తాళం వేసి సీల్ వేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ విచక్షణతో బాధ్యతాయుతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

వలస ఓటర్లపై వల



- వారిని స్వగ్రామాలకు రప్పిస్తున్న అభ్యర్థులు
- ప్రత్యేక బస్సులు పంపిస్తున్న వైనం
- ఇప్పటికే కొందరు గ్రామాలకు చేరిక
- ప్రతీ ఓటు కీలకం కావడంతో..
- ప్రత్యేక టీములు ఏర్పాటు చేసిన పార్టీలు

(రణస్థలం)

పోలింగ్‌కు మరో మూడు రోజుల వ్యవధి మాత్రమే ఉంది. దీంతో అన్ని పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. గ్రామాలు, పట్టణాల వారీగా అనుకూల ఓట్లు ఏవి, వారిని ఎలా కలవాలి? ఏ విధంగా తమవైపునకు తిప్పుకోవాలి అని ప్లాన్ చేస్తున్నాయి. అందులో భాగంగా వలస ఓటర్లపై అభ్యర్థులు దృష్టిపెట్టారు. వారిని రప్పించేందుకు బస్సులను పంపిస్తున్నారు. రానూపోనూ ఖర్చులను అభ్యర్థులే భరిస్తున్నారు. దీనికోసం ప్రత్యేక టీములు పని చేస్తోన్నాయి. జిల్లాలో దాదాపు 3 లక్షల వరకూ వలస ఓటర్లు ఉన్నట్టు తెలుస్తోంది. అందులో సింహభాగం మత్స్యకారులు, భవన నిర్మాణ కార్మికులే. ఇప్పటికే చాలామంది స్వగ్రామాలకు చేరుకున్నారు. మిగతా వారు కూడా బయలుదేరుతున్నారు. దీంతో బస్సులు, ఇతరత్రా వాహనాలకు ఖాళీ లేకుండా పోతోంది.

● ఎచ్చెర్ల నియోజకవర్గంలో 30 వేల మంది వరకూ వలస ఓటర్లు ఉన్నారని అంచనా. ప్రధానంగా రణస్థలం మండలం దోనిపేట నుంచి ఎచ్చెర్ల మండలం బుటగట్ల పాలెం వరకూ పదుల సంఖ్యలో మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో వేలాది మంది మత్స్యకారులు తీర రాష్ట్రాలకు ఉపాధి కోసం వెళ్లారు. వారిని రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జి.సిగడాం, లావేరు మండలాల నుంచి ఎక్కువ మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. వారిని సైతం రప్పించేందుకు నేతలు మాట్లాడుతున్నారు.

● శ్రీకాకుళం నియోజకవర్గంలో వలస ఓటర్లే ప్రభావితం చేయగలరు. ప్రధానంగా గార మండలానికి చెందిన మత్స్యకారులు వలసబాట పట్టారు. సీమెన్లతో పాటు చెన్నై, గుజరాత్‌కు చేపల వేట కోసం వెళ్లిన వారు ఉన్నారు. 25 వేల మంది వలస ఓటర్లు ఉంటారని అంచనా. శ్రీకాకుళం నగరంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపార వర్గాలు అధికంగా ఉన్న తరుణంలో ఓ ప్రధాన పార్టీ వలస ఓటర్లపై గురిపెట్టినట్టు సమాచారం.

● నరసన్నపేట నియోజకవర్గంలో 30 వేల మంది వరకూ వలస ఓటర్లు ఉన్నట్టు తెలుస్తోంది. నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పోలాకి మండలాల్లో చిన్నసన్నకారులు అధికం. వీరు వ్యవసాయ సీజన్లలో పనులు పూర్తిచేసి.. తరువాత భవన నిర్మాణ పనులకు సుదూర ప్రాంతాలు వెళతారు. వీరిని రప్పించేందుకు అభ్యర్థులు ఏర్పాట్లు చేశారు.

● టెక్కలి నియోజకవర్గంలో 25 వేల వరకూ వలస ఓటర్లు ఉంటారు. ప్రధానంగా సంతబొమ్మాళి మండలంలో మత్స్యకారులు, సీమెన్లుగా ఎక్కువ మంది. అలాగే చాలామంది విదేశాల్లో నిర్మాణరంగంలో పనిచేస్తున్నారు. నందిగాం, టెక్కలి, కోటబొమ్మాళికి చెందిన భవన నిర్మాణ కూలీలు వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్నారు. వీరంతా ఓటేసేందుకు స్వగ్రామాలకు వస్తున్నారు.

● ఆమదాలవలసలో 30 వేల మంది వలస ఓటర్లు ఉన్నారని అంచనా. ఇందులో పొందూరు మండలానికి సంబంధించి చేనేత కార్మికులు స్థానికంగా గిట్టుబాటు కాక వలసవెళ్లారు. బూర్జ, ఆమదాలవలస, సరుబుజ్జిలి మండలాల్లో ఎక్కువ మంది మన రాష్ట్రంలోనే వివిధ నగరాలకు వలసపోయారు. వారిని రప్పించేందుకు ఏర్పాట్లు చేశారు.

● జిల్లాలో వలస ఓటర్లు అధికంగా ఉండేది పాతపట్నం నియోజకవర్గంలోనే. ఇక్కడ ఐదు మండలాల నుంచి దాదాపు 50 వేల మంది వరకూ వలస ఓటర్లు ఉంటారని అంచనా. ప్రధానంగా వీరంతా హైదరాబాద్‌లోనే ఎక్కువగా ఉన్నారు. చెన్నైలో కూడా భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరిని రప్పించేందుకు అభ్యర్థులు పోటీపడుతున్నారు.

● ఉద్దానం, మైదానం, ఏజెన్సీల కలగొలుపు పలాస నియోజకవర్గం. ఇక్కడ నుంచి కూడా వలస ఓటర్లు అధికం. ఈ నియోజకవర్గంలో 40 వేలకు పైగా వలస ఓటర్లు ఉంటారని అంచనా. విదేశాల్లో భవన నిర్మాణ పనిలో కుదిరిన యువత కూడా ఉన్నారు. మత్స్యకారులు కూడా ఉన్నారు. తమకు అనుకూలమైన ఓట్లు ఉంచి.. ప్రత్యర్థి పార్టీల సానుభూతిపరుల ఓట్ల తొలగించడానికి వైసీపీ నేతలు ప్రయత్నించినా.. ప్రతిపక్షాలు అడ్డుకున్నాయి. పోలింగ్‌కు రావాలని ఇప్పటికే అభ్యర్థులు చెప్పడంతో వారంతా బయలు దేరారు.

● ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సైతం వలస ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. దాదాపు 50 వేల మంది వరకూ ఉన్నారు. ప్రధానంగా మత్స్యకారులు ఎక్కువగా గుజరాత్, అండమాన్ నికోబర్ దీవులు వెళ్లారు. కర్ర మిల్లుల్లో పనిచేస్తున్న వారు కూడా ఉన్నారు. విదేశాల్లో భవన నిర్మాణ పనులు చేపట్టే యువత కూడా అధికం. వీరిని స్వగ్రామాలకు రప్పిస్తున్నారు.

అభ్యర్థుల్లో టెన్షన్

● వలస ఓటర్ల ఆచూకీ తెలియక అగచాట్లు

(నరసన్నపేట)

పోలింగ్ తేదీ దగ్గరపడడంతో అభ్యర్థుల్లో టెన్షన్ పెరుగుతోంది. ఎలాగైనా గెలవాలని అన్ని దారులూ వెతు కుతున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితా పక్కన పెట్టుకుని తనకు పడే ఓట్లపై లెక్కలు వేస్తున్నారు. మిగతా ఓట్ల కోసం కసరత్తు చేస్తున్నారు. కొన్ని జాబితాల్లో పేర్లు ఉన్నా, స్థానికంగా వారు కనిపించకపోవడంతో ఆచూకీ కోసం ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు అగచాట్లు పడుతున్నారు. వారు ఎక్కడ ఉన్నారో వెతకాలని అభ్యర్థులు తన అనుచరులకు సూచిస్తున్నారు. శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, పాతపట్నం, ఆమదాలవలస, సోంపేట తదితర పట్టణాలతో పాటు పల్లెల్లో కూడా ఆయా పార్టీల వార్డు ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, బూత్ ఏజెంట్ల ద్వారా ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలు సేకరిస్తున్నారు. జాబితాలో ఉన్న ఓటర్లు స్థానికంగా ఎంతమంది ఉన్నారు.. ఇతరప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఉన్నారు.. వారిని ఎలా రప్పించాలి.. తదితర అంశాలపై దృష్టి పెట్టారు. పట్టణాల్లో ఒక్కోవార్డులో 50 నుంచి 100 మంది వరకు వలస ఓటర్లు ఉండగా, పల్లెల్లో ఎక్కడో పనిచేస్తున్న వారు కూడా వందల సంఖ్యల్లో ఉన్నారు. గతంలో బీఎల్వోలు ఇం టింటా తిరిగి ఎక్కడ నివాసముంటున్నారో అక్కడే వారి ఓట్లను చేర్చాలని అధికారులు సూచించినా సాంకేతిక కారణాలతో కొందరు పట్టణాల్లో అమలు చేయలేదు. ఇప్పుడు అటువంటి ఓటర్లకు బీఎల్వోలు స్లిప్‌లు ఎలా ఇస్తారో అంతుపట్టడం లేదు. ఈనేపథ్యంలో పట్టణాల్లో అసలు ఓటర్ల స్థానంలో దొంగ ఓట్లు పడే అవకాశాలు ఉన్నాయని పార్టీల ప్రతినిధులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అలాగే ఇతర రాష్ట్రాలు, పట్టణాల్లో ఉన్న వలస ఓటర్ల రప్పించేందుకు గ్రామాల్లో రాజకీయ నాయకులు ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలెట్టారు.ఇందుకోసం మండలంలోని గ్రామాల నేతలను పార్టీ కార్యాలయాలకు రప్పించి తాజా ఓటర్ల జాబితాల్లో ఉన్న వలస ఓటర్లను గుర్తిస్తున్నారు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, బెంగళూరులోఉన్న వలస ఓటర్లను రప్పించేం దుకు జాబితాను సిద్ధంచేస్తున్నారు. వారికి వీలైతే బస్సులు ఏర్పాటు చేయడం కానీ, లేదా ఫోన్లు చేసి ఫోన్‌పే ద్వారా రానుపోను ఖర్చులకు డబ్బులు పంపించి రప్పించేం దుకు ప్రయత్నాలు మొదలెట్టారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం కావడంతో వలస ఓట్లకు ప్రాధాన్యం ఏర్పడింది.

రైల్వే స్టేషన్ల వద్ద సిద్ధంగా వాహనాలు..

పలాస రూరల్: బయట రాష్ట్రాలు, దూరప్రాంతాల్లో ఉన్న జిల్లా వలస ఓటర్లు పెద్ద సంఖ్యలో స్వగ్రామాలకు చేరుతున్నారు. వారు రైల్వే స్టేషన్లకు వచ్చేసరికే అక్కడ ప్రధాన పార్టీల నాయకులు తమ వాహనాలను సిద్ధంగా ఉంచుతున్నారు. ఆ వాహనాల్లో వారిని ఎక్కించుకుని స్వగ్రామాలకు తరలిస్తున్నారు. విశాఖ, ఫలక్‌నుమా, కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లలో వలస ఓటర్లు ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం, తదితర రైల్వే స్టేషన్లలో దిగుతున్నారు. ఆ సమయంలో స్టేషన్‌కు నాయకులు చేరుకుని వారికి స్వాగతం పలుకుతున్నారు. తమ పార్టీకే ఓట్లు వేయాలని, తాము చేసిన సేవలను వారికి వివరిస్తున్నారు. అనంతరం వాహనాల్లో వలస ఓటర్లను స్వగ్రామాలకు చేరుస్తున్నారు.

ఫోన్‌పే ద్వారా రవాణా ఖర్చుల చెల్లింపు..

పోలాకి: ఓటు వేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి బస్సులు, రైళ్లు, ఇతర వాహనాల్లో వస్తున్న వారికి స్థానిక నాయకులు ఫోన్ పే ద్వారా రవాణా ఖర్చులు చెల్లిస్తున్నారు. మండలంలోని 31 పంచాయతీల్లో ఉన్న వలస ఓటర్ల వివరాలను సేకరించి వారికి ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా రవాణా ఖర్చులను ముందుగా చెల్లిస్తున్నారు. నియోజకవర్గంలోని పోలాకి, నరసన్నపేట, జలుమూరు, సారవకోట మండలాల పరిధిలో శతశాతం పోలింగ్ జరిపించేందుకు అధికారులు, అభ్యర్థులు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఓటర్ల జాబి తాలో 40శతం వరకూ వలస ఓటర్లు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానికసంస్థల ఎన్నికల మాదిరిగా వలస ఓటర్లపై పార్టీపెద్దలు, అభ్యర్థులు దృష్టిసారిస్తున్నారు.



అక్కడ పరిస్థితి ఎలా ఉంది..

(నరసన్నపేట)

ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలపై విదేశాల్లో ఉంటున్న ప్రవాసాంధ్రులు, ప్రవాస కార్మికుల్లో ఆసక్తి నెలకొంది. అక్కడ ఎన్నికల ట్రెండ్, ప్రచారం ఎలా ఉందని స్థాని కంగా ఉండే కుటుంబసభ్యులు, బంధువుల నుంచి రోజువారీగా ఆరాతీస్తున్నారు. ప్రధానంగా గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం వెళ్లిన ప్రవాస కార్మికులు, ప్రవాసాంధ్రుల్లో చర్చనీయాంశమైంది. ఎన్నికలబరిలో నిలిచిన అభ్యర్థుల ప్రచార సరళిని ప్రవాస కార్మికులు ఎప్పటి కప్పుడు తెలుసుకుంటున్నారు. కొంతమంది ప్రవాస కార్మికులు తమ అనుకూలమైన అభ్యర్థులకు మద్దతుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు.

ప్రచారంలో పూల వర్షం కురవాల్సిందే..



వజ్రపుకొత్తూరు: ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు, నాయకులకు స్వాగతం పలికేందుకు అనుచరులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తుంటారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, బాణసంచా మోతతో ఆహ్వానిస్తుంటారు. ఇవన్నీ ఒక ఎత్తయితే.. అభ్యర్థి, ప్రచారానికి వచ్చే అగ్ర నాయకులపై పూల వర్షం కురిపించడం, గజమాలలు వేయడం, పూల దండలు వేయడానికి కార్యకర్తలు, అభిమానులు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో ఎన్నికల పుణ్యమాని తమ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోందని వ్యాపారులు చెబుతున్నారు. అన్నిగ్రామాల్లో కార్యకర్తలు, అభిమానులకు తమ నాయకులు, అభ్యర్థి వస్తున్నట్లు ముందే సమాచారం వస్తోంది. దీంతో దారిపొడవునా నాయకులపై పువ్వులు చల్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు నాయకులకు పూల దండలు వేసేందుకు, పువ్వులగుచ్ఛాలు అందించేందుకు ఎక్కువ ఖర్చుచేయాల్సి వస్తోందని అభిమానులు చెబుతున్నారు. మార్కెట్లోని పువ్వుల దుకాణాల వద్ద ప్రతిరోజూ ఉదయం సందడి నెలకొంటోంది. గతంలో ఏ ఎన్నికల్లో కూడా ఇటువంటి డిమాండ్ లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు.

పోలింగ్ ఏజెంట్ కోవర్టుగా మారితే..

(గార/మెళియాపుట్టి)

ఎన్నికల్లో పార్టీలకు పోలింగ్ ఏజెంటే కీలకం. ఆయన ఏమరుపాటుగా వ్యవహరించినా, అవతలి పార్టీకి కోవర్టుగా మారినా అంతేసంగతులు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి అభ్యర్థులు, పార్టీనాయకులు, కార్యకర్తలు పడిన కష్టం బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. పోలింగ్ కేంద్రాల్లో దొంగ ఓట్లను నివారించే బాధ్యత ఏజెంట్లపైనే ఉంటుంది. బోగస్ ఓట్లు పడకుండా చూడడం, పోలింగ్ సక్రమంగా జరుగుతుందా లేదా అన్న విషయం గమనిం చాలి. పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించి అనుమానం వస్తే అక్కడి అధికారి దృష్టికి తీసుకెళ్లాలి. పార్టీకి విధేయుడినే అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్‌గా నియమిస్తారు.

ఓటింగ్ పెరిగితే ఎవరికి నష్టం

(మెళియాపుట్టి)

జిల్లాలోని అసెంబ్లీ, లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగితే ఆ ప్రభావంపై ఎవరిపై ఉంటుందోనన్న ప్రశ్నలు ఇప్పటినుంచే వ్యక్తమవుతున్నాయి. మూడునెలలగా ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చి ఓటింగ్‌శాతం పెంపునకు అధికారులు కసరత్తు చేస్తున్న విష యం విదితమే. పోలింగ్‌కు ఇంకా మూడురోజులు మాత్రమే గడువు ఉండడంతో ఆయా పార్టీలు ప్రచారం ఉధృతంచేశాయి. వలస ఓటర్లను రప్పించే ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ తరుణంలో ఓటింగ్ తగ్గితే ఎవరికి నష్టం..పెరిగితే ఎవరికి లాభమని అభ్యర్థులు అంచనాలు వేస్తున్నారు. ఓట్లు శాతం తగ్గితే అధికార పార్టీకి కలిసివస్తుందన్న అంచనాలు వేస్తున్నారు.

ఓటింగ్ శాతం పెంపునకు కసరత్తు

ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రికఎన్నికల్లో పోలింగ్‌శాతం పెంచడానికి అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామాలు, పట్టణాల్లో మూడు నెలలుగా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఉపాధి పనుల వద్ద వేతనదారులకు ఓటు ఆవశ్యకతను వివరిస్తున్నారు. గ్రామాల్లో ఓటర్లకు చైతన్యం తీసుకువచ్చే బాధ్యతను డీఆర్‌డీఏ అధికారులకు కలెక్టర్ అప్పగించారు. దీంతో వారు మహిళా సంఘాలతో కలిసి చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.అయితే మరో వైపు ఎండల తీవ్రత గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతంపై కొంతమేర ప్రభావం పడే అవ కాశాలుఉన్నాయి. వలస ఓటర్లు రాని దగ్గర మాత్రం ఓటింగ్ శాతం తగ్గవచ్చని అధికారులు అంచనాలు వేస్తున్నారు. జిల్లాలో 2019 ఎన్నికల్లో 79 శాతం వరకు పోలింగ్ నమోదు కాగా ఈసారి మాత్రం 90 శాతం వరకు నమోదయ్యే అవకాశం ఉంటుందని అధికార్లు అంచనా లు వేస్తున్నారు.అధికంగా పోలింగ్‌కేంద్రాలు పెంచడంతోపాటు ఓటర్లకు ఇబ్బందులు రాకుం డా అన్ని ఏర్పాట్లుచేయడం వల్ల ఓటింగ్‌శాతం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. అవగాహనకల్పించడం వల్ల ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని అధికారులు చెబుతున్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేసేవారు అధికంగా రావడానికి ఆసక్తి చూపుతుండడంతో ఓటింగ్ శాతం పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా జిల్లాలో లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 2048 పోలింగ్ కేంద్రాల్లో 16,27,024 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు.



ఓటు హక్కుపై చైతన్యం కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

రండి మా పార్టీలో చేరండి



(హిరమండలం)

గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు ప్రచారం సాగిస్తున్నాయి. అభ్యర్థులు, పార్టీ కీలక నేతలు వ్యూహ, ప్రతివ్యూహాలతో ముందుకుసాగుతున్నారు. ఓవైపు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూనే, మరో వైపు చేరికలపై దృష్టిసారిస్తున్నారు. చేరికల వల్ల ఎంతోకొంత కలిసివస్తుందని భావించి అందుకు అభ్యర్థులు ప్రాధాన్యంఇస్తున్నారు. ప్రధాన పార్టీల్లోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ద్వితీయశ్రేణి నాయకులు తమకు ప్రాధాన్యం ఇవ్వడంలేదని ఇతర పార్టీలో చేరిపోతున్నారు. వారిచేరికతో ఎంతోకొంత కలిసి వస్తుందని భావించి అభ్యర్థులు కూడా వారిని ఆహ్వాని స్తున్నారు. పగలు ప్రచారం చేసి,రాత్రి వేళల్లో తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు.ప్రత్యర్థి పార్టీల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకుల వివరాలను మధ్యవర్తుల ద్వారా ఆరాతీసి పార్టీలోకి వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారు.పార్టీలోకి వస్తామనే నాయకుల ఓటు బలం ఎంత, సామాజిక వర్గంలో వారికున్న బలగం ఆధారంగా అభ్యర్థులు వారికి భవిష్యత్తు భరోసా ఇస్తున్నారు. అయితే కొన్ని నియోజకవర్గాలోని పలు గ్రామాల్లో చేరికలపై సొంత పార్టీ నాయకుల నుంచి వ్యతిరేకత లేకపోలేదు.



వాహనాలకు అమర్చిన సీసీ కెమెరాలు

నిఘాపై నిఘా

● ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు సీసీ కెమెరాలు

(నరసన్నపేట)

ఎన్నికల్లో జరిగే అక్రమాలు, ప్రలోభాలు, నియమావళి ఉల్లం ఘనలు సహా అన్ని రకాల అంశాలను పరిశీలించే ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల పనితీరులో పారదర్శకత తీసుకువచ్చేందుకు వారి వినియోగించే వాహనాలను సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిని బట్టి ప్రతి నియోజకవర్గంలో గెజిటెడ్ అధికారులు నేతృత్వంలో ఫ్లయింగ్ స్క్వాడ్లు నియమి ంచారు. ప్రతి ఎనిమిది గంటలకు ఒక స్క్వాడ్ విధులు నిర్వ ర్తించేలా నియోజవర్గానికి ఆరు నుంచి తొమ్మిది మంది వరకు ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రతి నియోజవర్గంలో షాడో బృందంతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ వినియోగించే వాహ నాలకు సీసీ కెమోరాలను ఏర్పాటుచేసి మరింతగా నిఘాను ఈసీ పెంచింది. రాజకీయ నాయకులు సమావేశాలు, సభలు, సభల్లో వారు వ్యవహరించే తీరును ఈ వాహనాలు సీసీ కెమెరాల ద్వారా నేరుగా జిల్లా, రాష్ట్ర ఎన్నికల అధికారులు పరిశీలించేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. ఈ వాహనాలకు జియోట్యాగ్ కూడా చేశారు. వీరి కదిలికపై కూడా ఉన్నతాధికారులు పర్యవేక్షించేందుకు వీలుగా నిఘాపై నిఘా నేత్రం ఏర్పాటు చేశారు. నిఘా అధికారులపై మరింత నిఘాను ఈసీ పెంచింది.

ముంచెత్తుతున్న నగదు, మద్యం



ఇచ్ఛాపురం: పోలింగ్‌కు మూడురోజులు మాత్రమే గడువు ఉండడంతో అభ్యర్థులు ప్రచారం స్పీడ్‌పెంచారు. మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నారు. పోలింగ్‌కు రెండురోజులు ముందుగానే గట్టుగా పంపిణీ వ్యవహారం పూర్తిచేయాలని యోచిస్తున్నారు. ఈ విషయంలో అధికార వైసీపీ మరింత దూకుడుగాఉంది. ఆ పార్టీ అభ్యర్థులు పోటీచేస్తున్న జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఇప్పటికే భారీగా నగదు, బహుమతులు పంచుతున్నారని విస్తృత ప్రచారం సాగుతోంది. కొన్ని అసెంబ్లీస్థానాల్లో పెద్దఎత్తున డబ్బులు కొందరి నివాసాల్లో డంప్ చేశారు. పోలింగ్‌కు ముందు పంచడానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో వైసీపీనాయకులు వారికి అనుకూలంగా ఉన్నవారికి నగదు,మద్యంతో ముంచెత్తుతున్నారు. కొంతమందికి రోజువారీ ఖర్చుల నిమిత్తం రూ.500 నుంచి రూ.1000 వరకు ఇస్తున్నారు.ఈనేపథ్యంలో ఒక్కో నియోజకవర్గంలో లక్ష ఓట్లకు తగ్గకుండా వెయ్యి రూపా యల వరకు పంపిణీకి అధికార పార్టీ నాయకులు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కొంత మంది ఓటర్లు మాత్రం ఎంతఇస్తారు, ఎప్పుడిస్తారని బహిరంగానే నాయకులను ప్రశ్నిస్తున్నారు.

మహిళా సంఘాలే లక్ష్యంగా..

అధికార పార్టీ నాయకులు మహిళాసంఘాలను దాదాపు లక్ష్యంగా పెడుతున్నారు. మహిళా సంఘసమావేశాల్లో జరిగేలోపే ఒక్కోగ్రూపునకు లెక్కపెట్టి మరీ డబ్బులు ఇచ్చేందుకు వైసీపీ నాయకులు ఇప్పటికే చొరవతీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలోని ఉన్నగ్రూపుల సభ్యులు ఎంత ఆశిస్తున్నారు, తామెంత ఇవ్వబోతున్నాం అన్న విషయంపై వైసీపీ నాయకుల్లో చర్చ జరుగుతోంది. ఒక్కోగ్రూపునకు రూ.పది వేలుకు తక్కువ కాకుండా ఇచ్చేందుకు వైసీపీ నాయకులు రంగం సిద్ధంచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లోని సంఘాలకువారు అడిగినంత మేర సొమ్ము అందజేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. సామాజికవర్గాల వారీగా ఓటర్లను గుర్తించి వారి పెద్దలతో ఓటుకు నోటు పంపిణీ చేసేందుకు వైసీపీ నాయకులు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం డబ్బు పంపిణీపై ఎన్నికల సంఘం నిఘా పెట్టింది. దీంతో పెద్దమొత్తంలో నగదు తీసుకుని ఇం టింటికి వెళ్లి పంపిణీ చేయడం కష్టతరంగా మారింది. దీంతో ఆయాప్రాంతాలను ఎంచుకుని సామాజికవర్గ పెద్దలతోనే పంపిణీ చేయించేందుకు యోచిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం మద్యం దుకాణాల్లో మద్యం కట్టడి చేసింది. మరోవైపు అధికార వైసీపీ మాత్రం ముందు చూపు ప్రదర్శించి మూడు నెలల ముందుగానే ఎక్కడికక్కడ మద్యం డంప్ చేసినట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. జిల్లాలో ఏ మూల విన్నా ప్రస్తుతం డబ్బు అనే మాటే వినిపిస్తోంది.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
శుక్రవారం 10 మే 2024

పందెం అంటే పరార్..!



మెళియాపుట్టి: ఎన్నికల పోలింగ్‌కు ముందే గెలుపోటములపై పందెలు జోరందుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రచ్చబండలు, చెట్లకింద ఎన్నికల విశ్లేషణలపై చర్చ జరుగుతోంది. కొంద రైతే ఏకంగా పందెలతో ఢీ అంటే ఢీ అంటున్నారు. ఎక్కువగా కూటమి తరపున పందాలకు సిద్ధపడుతున్నారు. ప్రస్తుతానికి ఉన్న ట్రెండ్ మేరకు కూటమికి వ్యతిరేకంగా పందెం కాయడానికి ఎవరూ ముందుకురావడం లేదు. ప్రస్తుతం అధికార పార్టీకి అనుకూలంగా పందెమంటే పరారవుతున్నారు.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్

● పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్న ఉద్యోగులు

టెక్కలి/నరసన్నపేట/ఆమదాలవలస, మే 9: పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ గురువారం ముగిసింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, విద్యుత్ సిబ్బంది, పోలీసులు, ఆశా వర్కర్లు, ఆర్టీసీ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, డ్రైవర్లు ఇలా పలు



టెక్కలి: పోస్టల్‌బ్యాలెట్‌లో ఓటు వేస్తున్న ఉద్యోగి



టెక్కలి డిగ్రీ కళాశాలలోని పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం వద్ద ఉద్యోగుల హడావుడి

విభాగాల వారు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. చివరి రోజు టెక్కలిలో 105 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించు కున్నారు. మొత్తంగా ఆరురోజుల పాటు 3,040 మంది పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు వేశారు. ఈ ఆరు రోజులూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిర్వహించిన పోస్టల్‌బ్యాలెట్ ప్రక్రియకు సంబంధించి ఏకంగా అధికార పార్టీకి చెందిన నియోజకవర్గ పరిశీలకులు కాయల వెంకటరెడ్డి శిబిరంలో కూర్చొని సూచనలు చేస్తూనే కనిపించారు. కొంతమంది అంగన్‌వాడీ వర్కర్లకు అధికార పార్టీ వారు తాయిలాలు కూడా అందజేశారు. అయినా ఉద్యోగులు టీడీపీకి జై కొట్టినట్లు తెలిసింది. నరసన్నపేట నియోజకవర్గంలో ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఆరు రోజులు పాటు జరిగిన ఈ ప్రక్రియలో 2,974 మంది ఉద్యోగులు ఓటు వేశారు. ఈనెల 4న 783 మంది, 5న 1451 మంది, 6న 175 మంది, 7న 150 మంది, 8న 329 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. చివరి రోజు గురువారం 85 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్టు ఆర్వో రామ్మోహన్‌రావు తెలిపారు. ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత ఆరు రోజులుగా నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గురువారం ముగిసింది. 3,156 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నట్టు రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్ తెలిపారు. చివరి రోజు గురువారం 58 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొదటి రోజు 988 మంది, రెండో రోజు 1397 మంది, మూడోరోజు 243 మంది, నాలుగో రోజు 245 మంది, ఐదో రోజు 225 మంది ఉద్యోగులు ఓటింగ్‌లో పాల్గొన్నట్టు ఆయన తెలిపారు.

పేరు ఒకరిది.. ఫొటో మరొకరిది

నందిగాం: ఎన్నికల ఓటరు గుర్తింపుకార్డుల్లో పేరు ఒకరిది.. ఫొటో మరొకరిది దర్శనమిస్తున్నాయి. బీఎల్వోల ఆధ్వర్యంలో చేర్పులు, మార్పులు జరిగాయి. తిరిగి ఓటరుకు గుర్తింపుకార్డులు వచ్చే సరికి ఫొటోలు, పేర్లు వేర్వేరుగా ఉండడంతో ఓటర్లు అవాక్కవుతున్నారు. రౌతుపురంలో బొడ్డ రోజా రమణికి అందిన గుర్తింపుకార్డులో ఫొటో వేరొకరిది ఉండడం విశేషం. పలు గ్రామాల్లో తప్పులు తడకలతో గుర్తింపుకార్డులు అందజేశారు. ఫొటో, పేరునుబట్టి వేర్వేరుగా ఓటువేయడానికి వెళ్లే సమయంలో పోలింగ్‌సిబ్బంది అభ్యంతరాలు పెట్టవచ్చన్న అనుమానాలు ఓటర్లు వ్యక్తంచేస్తున్నారు.



రోజా రమణి ఓటరు ఐడీ కార్డులో వేరే మహిళ ఫొటో ఉన్న దృశ్యం

డమ్మీ ఈవీఎంలతో ప్రచారం

● ఉపాధ్యాయుడు, వలంటీర్‌ను అడ్డుకున్న టీడీపీ నాయకుడు

● దాడికి యత్నించిన వైసీపీ నాయకులు

పలాస: మండలంలోని గురుడఖండి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, వార్డు వలంటీర్‌తో పాటు వైసీపీ నాయకులు బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో సమావేశం నిర్వహించి, డమ్మీ ఈవీఎంలను పట్టుకుని ఇంటింటా ప్రచారం చేశారు. అక్కడున్న టీడీపీ నాయకుడు శివకుమార్ వీడియోతీసి టీడీపీ గ్రూపులో పోస్టు చేశాడు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు, వలంటీరు, వైసీపీ నాయకులు టీడీపీ నాయకుడిపై దాడికి దిగారు. ఆయన సెల్‌ను తీసుకుని చితకొట్టినట్లు బాధితుడు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పారినాయుడు తెలిపారు. ప్రస్తుతం ఉపాధ్యాయుడు, వలంటీరు డమ్మీ ఈవీఎంలను పట్టుకుని చేసిన ప్రచారం సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతోంది.

అప్పట్లో 70 శాతం దాటితే రీపోలింగ్

మీకు తెలుసా?

హిరమండలం: ఆంగ్లేయుల పాలనలో మండలాలను ఫిర్కాలుగా పిలిచేవారు. అప్పట్లో ఫిర్కాకు కొరకోన్ హోదాలో ఓ ఉద్యోగి విధులు నిర్వహించే వారు. గ్రామస్థాయిలో ఈ ఉద్యోగి వీఎం మేజిస్ట్రేట్‌గా వ్యవహరించే వారు. ప్రజలు వీరి వద్ద ఓటు నమోద చేసుకునేవారు. అప్పట్లో ఉద్యోగులు, విద్యావంతులు, భూస్వాములకు మాత్రమే ఆంగ్లేయులు ఓటు హక్కు కల్పించారు. బహిరంగంగా చేతులెత్తి ఓటుహక్కు వినియోగించుకునే విధానం అమలుచేశారు. కాలక్రమేణ ఓటువేసే విధానంలో మార్పులొచ్చాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా 1952లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థి పెట్టె వద్దకు వెళ్లి ఓటువేసే వారు. ఈ విధానంపై దేశవ్యాప్తంగా అభ్యంతరాలు వ్యక్తంకావడంతో అభ్యర్థులు ఎంతమంది ఉన్నా పెట్టె ఒకటే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పట్లో 70 శాతానికి మించి పోలింగ్ జరిగితే రిగ్గింగ్ జరిగిందని భావించి అధికారులు రీపోలింగ్ నిర్వహించేవారు. 1967 తర్వాత రహస్య ఓటింగ్ విధానం అమల్లోకి వచ్చింది.

అంతు చిక్కని ఓటరు నాడి

● అయోమయంలో అభ్యర్థులు



(నరసన్నపేట)

జిల్లాలో పలు నియోజకవర్గాల్లో ఓటర్ల నాడి అంతు చిక్కడం లేదు. ప్రధాన పార్టీల అభ్య ర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.గెలుపు మాదంటే మాదేనంటూ ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా ఓట్ల కోసం ఎక్కినగడప ఎక్కుతున్నారు. ప్రస్తుతం ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులకు నిబంధనలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అయినా వాటిని అధిగమించి ప్రచార పర్వం సాగిస్తున్నారు. ఓట ర్లు కూడా తమ తెలివిని ప్రదర్శిస్తున్నారు. ఏఅభ్యర్థి వెళ్లి ఓటడిగినా తప్పకుండా మీకే వేస్తా మని హామీ ఇస్తున్నారు. దీంతో ఓటరు నాడి అంతుచిక్కడం లేదు. మీకే ఓటేస్తామని అన్ని పార్టీల అభ్యర్థులకు భరోసా ఇస్తుండడంతో అభ్యర్థులు అయోమయంలోపడ్డారు.

ఆలే ఈలు.. ఈలే ఆలు!

● అవేన్రా ఎలచ్చన్ నెక్కలు

(శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ప్రచారం ముమ్మురంగా సాగుతోంది. ఓ పల్లెటూరిలో అంతకు రెండు రోజుల కిందట రెండు ప్రధాన పార్టీలు బహిరంగ సభ నిర్వహించాయి. అప్పటి నుంచీ గ్రామంలోని రచ్చబండ వద్ద విశ్లేషణలు సాగుతూనే ఉన్నాయి. సభ జరిగిన తీరుపై రకరకాల వ్యాఖ్యానాలు, విమర్శలు, ప్రతి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే ఓ రోజు సాయంత్రం ఇద్దరు వ్యక్తుల మధ్య రసవత్తర చర్చ జరుగుతోందిలా..

ఎంకడు: అవున్రా.. కిష్టా! నీవు ఏడో క్యాసు సదివినావు కదా.. నిన్నట్నుండి నీకొకటడుగుదావనుంద్రా..


కిష్ట: ఏట్రా అది?

ఎంకడు: మొన్న బుదారం సాయంకాలం మనూల్లో మీటింగెట్నారా పచ్చ పారిటీవోల్లు. ఆ మీటింగికట ఎయ్యి మందొచ్చినారని అన్నార్రా...

కిష్ట: అన్నీరా... అంతే నీకేటి?

ఎంకడు: ఓరది కాదురా.. అ మర్నాడు తెల్ల పారిటీ కూడా ఎట్నాది కదారా మీటింగు..

కిష్ట: అవును.



ఎంకడు: అదేన్రా.. ఆలు కూడా అన్నార్రా... పన్నిండొందల మంది వొచ్చినారని..

కిష్ట: అవున్రా.. అయితే నీకేట్రా బాద?

ఎంకడు: ఓరి బాద కాదురా.. మనూరు జెనాబా ఎంతరా?

కిష్ట: కిందటేడాదికి పిల్లా పిచ్చుకా కలిపి పదమూడొందల్రా..

ఎంకడు: అదుగో.. అద్గదే మరి.. ఆలకి ఎయ్యిమంది...ఈలకి పన్నిండొందల మంది కలిపితే.. రెండేలు దాటిపోనాదా..? ఇంత మందెక్కణ్ణించొచ్చినార్రా బాబూ?

కిష్ట: ఓరి ఎర్రిమాలోకవా.. అదేట్రా నీ డౌటు.. ఆలే ఈలు. ఈలే ఆలు.. అవేన్రా ఎలచ్చన్ నెక్కలు. ఎక్కువ ఆలోసించి బుర్ర పాడెట్టుకోకు. అల్లదో... మాయప్ప పిలత్తంది. సీకటౌడిపోనాది. ఇంటికెల్లి నాలుగు మెతుకులు తిను.

దండాలయ్యా.. దండాలు!

● పాదయాత్రలు... పలకరింపులు

● ప్రచారంలో తలమునకలు

(శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి)

ఎండలు మండుతున్నాయి.. వేడిగాలులు హోరెత్తిస్తున్నాయి.. అదే సమయంలో ఎన్నికల వేడి కూడా ప్రజలను ఊపిరాడనివ్వడం లేదు. ఉదయం ఓ పార్టీ అభ్యర్థి వస్తే.. రెండో పూట మరో అభ్యర్థి... ఇలా ఒకరి వెంట మరొకరు.. నాయకుల ప్రచారంతో ప్రజలు కూడా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.. ప్రచార రథాలకు అమర్చిన మైకులు హోరెత్తిస్తున్నాయి. అధికార, కూటమి పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు ఇతర పార్టీల వారూ ప్రస్తుతం ప్రచారంలో తలమునకలై ఉన్నారు. దండాలయ్యా.. దండాలయ్యా.. మాతోనే మీరు ఉండాలయ్యా అని ఓ సినిమాలోని పాటను ఎత్తుకుంటున్నారు.

సందడే సందడి..

చిన్న చిన్న గ్రామాలను ఉదయం పూట... పెద్ద గ్రామాలను సాయంత్రం వేళల్లో ప్రచారానికి ఎంచుకుంటున్నారు. ప్రచార రథాలపై వీధుల్లో తిరుగుతున్నారు. పట్టణాల్లోని వీధుల్లో పాదయాత్ర ద్వారా ఇంటింటా ప్రచారం చేస్తున్నారు.

వ్యూహాల్లో తలమునకలు..

ఒక పార్టీపై మరో పార్టీ పైచేయి సాధించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. వ్యూహాలు ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. గతంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ... మరింత అభివృద్ధి తమ నేతతోనే సాధ్యమని... తమ అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. కొత్తగా ఎన్నికల బరిలోకి దిగిన వారైతే...తమకు ఓ అవకాశం ఇచ్చి చూడాలని కోరుతున్నారు.

పూజలు..

గ్రామాలకు వెళ్లినపుడు స్థానికంగా ఉన్న ఆలయాలకు వెళ్లి అభ్యర్థులు పూజలు చేస్తున్నారు. స్థానిక నాయకులు వారితో ఆలయాలలో పూజలు చేయించేందుకు ఎక్కువగా ఉత్సాహాన్ని కనబరుస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి..

ఓ వైపు తమ మేనిఫెస్టోలలోని అంశాలను ఏకరవు పెడుతూ...మరోవైపు స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారు. మొత్తానికి ఈ దండాలు ఎవరికి వరమవుతాయో... ఎన్నికల ఫలితాలు వస్తేగానీ తెలియదు.



వైసీపీ పాలనకు చరమ గీతం పాడాలి

● కూటమి అభ్యర్థుల ప్రచారం

సంతబొమ్మాళి/గార/పొందూరు/రణస్థలం/జలుమూరు/కొత్తూరు, మే 9: రాష్ట్రంలో వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని కూటమి అభ్యర్థులు ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ రాష్ట్రానికి పట్టిన శని వదలాలంటే కూట మి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. సంతబొమ్మాళి మండ లంలోని తీరప్రాంతంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు, గార మండలంలో శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్, పొందూరు మండలం కింతలిలో ఆమదాలవలస నియోజకవర్గ అభ్యర్థి కూన రవికుమార్, జలుమూరు మండలం మర్రివలసలో నరసన్నపేట నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి, కొత్తూరు మండలం మెట్టూరులో పాతపట్నం టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు ఎచ్చెర్ల మండలం పొన్నాడలో కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు ప్రచారం నిర్వహించారు.



కొత్తూరు: ప్రచారం చేస్తున్న మామిడి గోవిందరావు



సంతబొమ్మాళి: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు



రణస్థలం: పొన్నాడలో మాట్లాడుతున్న ఎన్.ఈశ్వరరావు



పొందూరు: కింతలిలో రోడ్‌షోలో మాట్లాడుతున్న కూన రవికుమార్



గార: రోడ్ షో నిర్వహిస్తున్న రామ్మోహన్‌నాయుడు, గొండు శంకర్



జలుమూరు: మర్రివలసలో ప్రచారం నిర్వహిస్తున్న బగ్గు రమణమూర్తి

వైసీపీ గాలి పార్టీ: అచ్చెన్నాయుడు



టెక్కలి: టీడీపీలో చేరిన వారితో అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి: వైసీపీ గాలి పార్టీ అని, ఈ ఎన్నికల్లో కొట్టుకుపోవడం ఖాయమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీడీపీ గాలి వీస్తోందని తెలుసుకుని ఈనెల 15 నుంచి విదేశాలకు సీఎం జగన్ వెళ్లిపోతున్నాడన్నారు. రాష్ట్రంలో ఉద్యోగుల పోస్టర్ ఓట్లు 3.80 లక్షలకుపైగా ఎన్డీఏ కూటమికి పోలైనట్లు తెలుస్తోందన్నారు. ఐదేళ్లుగా శివారు గ్రామాలకు చుక్క సాగునీరు రాక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే హిరమండలం రిజర్వాయర్ నుంచి మేఘ వరం వరకు వంశధార కాలువకు సిమెంట్ లైనింగ్ చేస్తామన్నారు. కంచుకోట అయిన సంతబొమ్మాళి మండలంలో అత్యధిక మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అట్టాడ రాంప్రసాద్, మాజీ ఎంపీపీ చిదపాన ధర్మారున రెడ్డి, టెక్కలి జనసేన ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. టెక్కలి మండలం భగవాన్ పురంలో ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు తరఫున ఆయన కుమారుడు కృష్ణమోహన్ నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● **టెక్కలి:** నియోజకవర్గానికి చెందిన పలు గ్రామాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. నందిగాం మండలం దిమిలాడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు డిక్కళ్ల రాజు తదితరులు, రావివలస ఉప సర్పంచ్ జలుమూరు దామోదర్, బూరగాం పంచాయతీ నాయుడుపేట నుంచి నీలాపు జలంధర్ రెడ్డి తదితరులు టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా: శిరీష



అనకాపల్లిలో మాట్లాడుతున్న గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు: ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వండి.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని పలాస అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. గురువారం రాజాం, గరుడుభద్ర, చీపురు పల్లి, గుణుపల్లి, మోట్టూరు, గోవిదంపురం, అమలపాడు పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానన్నారు. మంత్రి అప్పలరాజు హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటు పడిందన్నారు. వైసీపీ నాయకులు కొండలు, గుట్టలు ఆక్రమించుకోవడంతో ఎలుగుబంట్లు గ్రామాల్లోకి వచ్చి ప్రజలను పొట్టన పెట్టుకుంటున్నాయన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత ప్రణాళికా బద్ధంగా ఎలుగుబంట్ల నియంత్రణకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జీడిపంటకు మద్దతు ధర కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు పి.సాంబమూర్తి, రెల్ల దానయ్య, పుచ్చ ఈశ్వరరావు, ఎంపీటీసీ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ సీనియర్ నాయకుడు 'సప్ప'

పలాస: పలాస పురుషోత్తపురం కాలనీకి చెందిన వైసీపీ సినీయర్ నాయకుడు, మంత్రి అప్పలరాజు అనుచరుడు సప్ప మన్మథరావు గురువారం టీడీపీలో చేరారు. పార్టీ కార్యాలయంలో ఆయనకు పలాస సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, గాలి కృష్ణారావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, సప్ప నవీన్, శంకర్, అంబటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తా: ఈశ్వరరావు



జాలారి కొయ్యాంలో కూటమికి మద్దతిచ్చిన వారితో ఉమ్మడి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు

రణస్థలం: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఎచ్చెర్ల మండలం పొన్నాడ, ధర్మవరం, భగీరథపురం, డి.మత్స్యలేశం, బడివానిపేట తదితర గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో గడచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. నారాయణపురం ఆధునికీకరణ పనులను వైసీపీ ప్రభుత్వం పూర్తిచేయలేక పోయిందన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా కమలం, ఎంపీగా కలిశెట్టి అప్పలనాయుడును సైకిల్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ధర్మవరం, జాలారి కొయ్యాం గ్రామాలకు చెందిన సుమారు 150 కుటుంబాలు వైసీపీ నుంచి కూటమిలో చేరి మద్దతు తెలిపారు. వీరికి ఈశ్వర రావు కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా పూర్వ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, కూటమి నేతలు బెండు మల్లేశ్వరరావు, పంచి రెడ్డి సత్య నారా యణ, పంచిరెడ్డి కృష్ణారావు, గాలి వెంకటరెడ్డి, అన్నెపు భువనే శ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఎన్డీఏ కూటమి ఎచ్చెర్ల బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు సతీమణి రజని భర్త తరఫున గురువారం తెప్పలవలస పంచాయతీలో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

వైసీపీ అరాచకాలకు తెరదించాలి: గొండు శంకర్



అరసవల్లి: వైసీపీ అరాచకాలకు తెరదించాలని టీడీపీ-బీజేపీ-జనసేన ఉమ్మడి శ్రీకాకుళం అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తపేట జంక్షన్ నుంచి కల్లేపల్లి వరకు రోడ్డు షో నిర్వహించారు. ఒక్క చాన్సు ఇస్తే అంద రి జీవితాలను అంధకారం చేశారని, వైసీపీ ప్రభు త్వం పై ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తోందన్నారు. రాష్ట్రం మరలా బాగుపడాలంటే కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు రావడం అత్యవసరమన్నారు. ఎంపీగా రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి: ఎంపీ

నందిగాం: రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. సుభద్రాపురం, బోరుభద్ర, దేవుపురం, పెద్దలవునిపల్లి, హరిదాసుపురం తదితర గ్రామాల్లో పర్యటిం చారు. సీఎం జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని, మళ్లీ సురక్షిత పాలన కావాలంటే కూటమికి మద్దతివ్వాలని కోరారు. ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా అచ్చెన్నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. ● **గార:** రాష్ట్రంలో గడచిన ఐదేళ్లుగా నిరంకుశ పాలన సాగుతోందని, దీనికి ఈ ఎన్నికల్లో చరమగీతం పాడాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కూటమి శ్రీకాకుళం అసెంబ్లీ అభ్యర్థి గొండు శంకర్‌తో కలిసి గార మండలంలోని పలు గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. తనను ఎంపీగా, గొండు శంకర్‌ను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కూటమి నాయకులు పీస వెంకటరమణ మూర్తి, బడగల వెంకట అప్పారావు, గుండ భాస్కరరావు, మళ్ల అబ్బాయినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కళింగ కోమట్లను గుర్తించినది టీడీపీయే: బగ్గు



మాట్లాడుతున్న ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: జిల్లాలో కళింగ కోమట్లను గుర్తించి బీసీల్లో చేర్చింది టీడీపీ ప్రభుత్వమేనని ఉమ్మడి పార్టీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం స్థానికంగా ఓ కల్యాణ మండపంలో కళింగ కోమట్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కళింగ కోమట్లకు సముచిత స్థానం ఇవ్వడంతో పాటు సజావుగా వ్యాపారాలు చేసుకునేందుకు తగిన వాతావరణం కల్పిస్తామన్నారు. సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కళింగ కోమట్ల నాయకులు బోయన గోవిందరాజులు, జామి వెంకట్రావు, ఉణ్న వెంకటేశ్వర రావు, బోయన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నరసన్నపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. స్వగ్రామం మర్రివలసలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మర్రివలసను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తాన న్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, సర్పంచ్ బగ్గు గోవిందరావు, దుంగ స్వామిబాబు, రామచంద్రరావు, తర్ర బలరాం తదితరులు పాల్గొన్నారు. అక్కురాడకి చెందిన పలువురు వైసీపీ యువకులు టీడీపీలో చేరారు. వీరికి పార్టీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్ర నాయుడు కండువాలు కప్పి ఆహ్వానించారు.

నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతా: రవికుమార్



బూర్జ: పార్టీలో చేరిన వారితో ఉమ్మడి అభ్యర్థి కూన రవికుమార్

పొందూరు: ఆమదాలవలస నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కూటమి అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని లుట్టపేట, యాగాటిపేట, ఎస్ఆర్ఎస్ కాలనీ, గూనానిపేట, కింతలి, కనిమెట్ట తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపిం చాలని కోరారు. బీసీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి దామోదరరావుతో పాటు తోలాపి తో పాటు పలు గ్రామాలకు చెందిన 50 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వీరికి రవికుమార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, నాయకులు కె.సత్య నారాయణ, అన్నెపు రాము, శంకరభాస్కర్, వి.మురళి, ఎస్.శ్రీరంగ నాయకులు పాల్గొన్నారు. ● **బూర్జ:** ఇంతవరకు ప్రభుత్వ ఆస్తులను కొల్లకొట్టిన వైసీపీ ప్రభుత్వం ప్రజల ఆస్తులపై కన్నేసిందని, అందుకే ల్యాండ్ టైటిలింగ్ జీవోలను తీసుకువస్తోందని ఆమదాలవలస కూటమి అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. పనుకుపర్త, రాజుపేట, కొమ్ము వలస, పీఎల్‌దేవిపేట, సంకురాడ గ్రామా ల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్పీకర్ సీతారాం డమా బుస్సు మాటలకు పడవ ద్దన్నారు. పనుకుపర్త గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మక్కా అప్పల నాయు డు, 20 మంది కుటుంబ సభ్యులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాదరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ● **సరుబుజ్జిలి:** రాష్ట్రంలో ఐదేళ్లుగా కొనసాగుతున్న దుర్మార్గ పాలనపై ఈ ఎన్ని కల్లో ఉమ్మడి కూటమిదే విజయమని ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. గురువారం పురుషో త్తపురంలో రోడ్‌షో నిర్వహించారు. కూటమి అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉమ్మడి కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్ ప్రచారం



సోంపేట: కొర్లాం గ్రామంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో తనను మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పీవీ రమణ, రాంబుడ్డి గణపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కంచిలి: మండలంలోని అంపురం జంక్షన్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అంపురం గ్రామానికి చెందిన మద్ది అప్పారావు (54)మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అప్పారావు దుబాయిలో వలస కూలీగా పనిచేస్తున్నాడు. ప్రతీ ఏటా ఒకసారి గ్రామానికి వచ్చి మరలా దుబాయి వెళుతుం టాడు. నెల కిందట స్వగ్రామానికి వచ్చిన అప్పారావు వాకింగ్‌కు వెళ్లి అంపురం జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా బొలేరో వాహనం వేగంగా వచ్చి ఢీనడంతో గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. కుటుం బ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ..

పలాసరూరల్: కాంట్రగడ గ్రామం వద్ద గురువారం ఉదయం ద్విచక్ర వాహనం ఢీకొని పి.దుర్యోధన (75) మృతి చెందాడు. కాశీబుగ్గ పోలీసులు అందిం చిన సమాచారం మేరకు.. దుర్యోధన కాంట్రగడ గ్రామం వద్ద నడుచుకొంటూ వెళ్తుండగా వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్రంగా గాయప డ్డాడు. క్షత గాత్రుడ్ని హుటాహుటిన శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ పారి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

50 మద్యం సీసాలు స్వాధీనం

జలుమూరు: కామినాయుడుపేటలో అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న 50 మద్యం సీసాలను స్వాధీనం చేసు కున్నట్లు ఎస్ఈబీ సీఐ గాయత్రి తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో గురువారం తనిఖీ చేపట్టగా లొట్టి శ్రీనివాస రావు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి: ఎంజీఆర్



పార్టీలో చేరిన వారితో మామిడి గోవిందరావు

కొత్తూరు: వంశధార నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాతపట్నం ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. గురువారం నిర్వాసిత గ్రామాలైన మెట్టూరు బిట్-1, బిట్-2, పాడలిఆర్ఆర్ కాలనీ, గొట్టిపల్లి, ఓంద్రుజోల, గూనబద్ర, పారాపురం, మాసింగి, కర్లెమ్మ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కావాలంటే కూటమి ప్రభుత్వం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లో నిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తానన్నారు. అల్తి గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎంజీఆర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు భాస్కరరావు, శ్రీను, ధర్మయ్య, రవి, దర్శన, సురేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.● **ఎల్.ఎన్.పేట:** లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు గురువారం టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం. మనోహర్‌నాయుడు, కె.చిరంజీవి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు వి.గోవిందరావు, కె.కృష్ణమాచారి, కె.మన్మథరావు, ఎస్.కిషోర్‌కుమార్, వి.ఆనందరావు, ఎస్.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి

కాశీబుగ్గ: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కాశీబుగ్గ డీఎస్పీ పి.నాగేశ్వరరెడ్డి అన్నారు. కాశీబుగ్గ చినబాడాం గ్రామంలో గురు వారం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ జరిగే సమయంలో గొడవలు గాని, కొట్లాటలకు దిగవద్దన్నారు. అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ● **హిరమండలం:** మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు, ప్రత్యేక కేంద్ర బలగాలు గురువారం కవాతు నిర్వహించాయి. హిరమండలం, సుభలయ, గులుమూరు, కొండరాగోలు గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణ స్వామి, ఏఎస్ఐ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.● **గార:** గార ఎన్నికల నేపథ్యంలో గురువారం రాత్రి తూలుగులో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఐ ఎల్.ఎస్.నాయుడు, ఎస్.ఐ కె.కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో పాటు పోలీసు సిబ్బంది కవాతులో పాల్గొన్నారు. ● **నరసన్నపేట:** మేజర్ పంచాయతీల్లో ఓటర్లు స్వేచ్ఛాయుతంగా ఓటు వేసేందుకు సహకరిస్తామని సీఐ ప్రసాదరావు అన్నారు. గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

ట్రాక్‌పై నిలిచిపోయిన గూడ్స్ రైలు: ట్రాఫిక్‌కు అంతరాయం



పలాస: కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద హెవీ గూడ్స్ పట్టాలపై నిలిచిపోవడంతో గురువారం రాత్రి రెండు వైపులా వాహనాలు గంటన్నరకు పైగా నిలిచిపోయాయి. భువనేశ్వర్ నుంచి వచ్చిన గూడ్స్ పలాస రైల్వేస్టేషన్ పెద్ద సిగ్నల్ వద్ద గేటు మధ్యలో నిలిచి పోయింది. దీంతో గేటును గంటన్నర పాటు తీయక పోవడంతో వాహనాలు బారులు తీరాయి. బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వేరే దారి లేక గంటన్నరపాటు ట్రాఫిక్‌లో ఉండిపోవాల్సి వచ్చింది. అనంతరం రాత్రి 10.15 నిమిషాలకు రైలు కదలడంతో లారీలు, బస్సులు బయలుదేరాయి.

టీడీపీ జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి మృతి

అరసవల్లి: టీడీపీ జిల్లా పార్టీ ఇన్‌చార్జి, సీనియర్ కార్యకర్త గొర్లె వెంకటరమణ గురువారం హఠాన్మరణం చెందారు. ఆయన మృతి వార్తను నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేక పోతున్నారు. పార్టీ మంచి కార్యకర్తను కోల్పోయిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ అన్నారు. గురువారం సాయంత్రం మృతుని నివాసానికి చేరుకుని నివాళులర్పించారు.

విదేశాలకు వెళ్లేందుకు జగన్ సిద్ధం

ఆమదాలవలస: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమిపాలై సైకో సీఎం జగన్ రెడ్డి విదేశాలకు పారిపోయేందుకు సిద్ధంగా ఉన్నారని తెలుగుశక్తి రాష్ట్ర అధ్యక్షుడు బీవీ రామ్ అన్నారు. గురువారం ఆమదాలవలస టీడీపీ కార్యాల యంలో విలేకరులతో మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కూన రవికుమార్, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు.

అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోండి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్: ఈనెల 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ జీఆర్ రాధిక కేంద్ర బలగాల అధికారులకు సూచించారు. ఎన్నికల విధులకు జిల్లాకు వచ్చిన కేంద్ర సాయుధ దళాలు, పోలీసు అధికారులతో గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎన్నికల రోజున పాటించాల్సిన నియమ నిబంధనలు, రూట్ మ్యాప్‌పై అవగాహన, పోలింగ్ స్టేషన్, చెక్‌పోస్టులు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద విధులపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఏఎస్పీ ప్రేమ్ కాజల్, డీఎస్పీలు వై.శృతి, జి.నాగేశ్వరరెడ్డి, ఎ.త్రినా థరావు, ఎల్.శేషాద్రినాయుడు, కేంద్ర బలగాల అధికారులు పాల్గొన్నారు.

198 మద్యం సీసాలు పట్టివేత

రణస్థలం: లావేరు మండలం బెజ్జిపురం వద్ద గురువారం 198 మద్య సీసాలు పట్టుకున్నట్లు ఎస్ఈబీ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. అయితే ఆసమయంలో మద్యం సీసాలతో ఉన్న వ్యక్తి పరారయ్యాడన్నారు.

ఎన్నికలకు సర్వ సన్నద్ధం

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్: సాధారణ ఎన్నికల నిర్వహణకు సర్వ సన్నద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల నేపథ్యం లో 72 గంటల ముందు చేయాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు, విస్తరణ ప్రణాళిక అమలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురు వారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. శ్రీకాకుళం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు ఎస్పీ జీఆర్ రాధిక పాల్గొన్నారు. పోలింగ్ సందర్భంగా తీసుకున్న చర్యలను కలెక్టర్ ఆయనకు వివరించారు. అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో ఎం.గణపతిరావు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

పోలింగ్, ప్రీ పోలింగ్ (ఈనెల 12, 13 తేదీల్లో) రోజుల్లో దిన పత్రికలలో ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు ఇచ్చే ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఇందుకు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ మానటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ)కి ప్రకటన జారీచేసే రెండు రోజుల ముందుగా దరఖాస్తు చేయాలని, ముంద స్తు ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ఈ రెండు రోజుల్లో ఎలాంటి రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయరాదని స్పష్టం చేశారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఇబ్బంది లేకుండా చర్యలు

రణస్థలం: జిల్లాలో ఈనెల 13న పోలింగ్ అనంతరం ఈవీఎంలను శ్రీ శివానీ ఇంజనీ రింగ్ కళాశాల (చిలకపాలెం)లో భద్రపరిచే కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు, సీనియర్ ఐఏఎస్ అధికారి శేఖర్ విద్యార్థి, సీనియర్ ఐపీఎస్ అధికారి దిగంబర్ ప్రధాన్, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్పీ జీఆర్ రాధిక గురువారం సందర్శించారు. ఈవీఎంలను తీసుకునే రిసెప్షన్ కేంద్రాలను, వీటిని భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. జేసీ ఎం.నవీన్, కార్పొరేషన్ కమిషనర్ తమీమా అన్సారియా, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఏఎస్పీ ప్రేమ్ కాజల్ తదితరులు పాల్గొన్నారు.

Format C-1
DECLARATION ABOUT CRIMINAL CASES

(As per the judgment dated 25th September, 2018 of Hon'ble Supreme Court in WP (Civil) No.536 of 2011 (Public Interest Foundation & Ors Vs. Union of India & Anr.)

Name and address of candidate: **Shri. ASHOK BENDALAM,** Ramaya Putuka village, kaviti Mandalam-532322, Srikakulam, AP.

Name of political party: **TELUGU DESAM PARTY**
(Independent candidates should write "Independent" here)

Name of Election: **MLA (AP) STATE**

Name of Constituency: **ICHAPURAM**

I, **ASHOK BENDALAM** (name of candidate), candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending criminal cases

Sl. NO.	Name of Court	Case No.and dated	Status of case(S)	Section (s) of Acts concerned and brief description of offence (s)
1.	Two Town PS Srikakulam	111/2021	Closed	U/S 151 Crpc Preventive arrest only
2.	Two Town PS Srikakulam	1092 / 2020	Pending Trail	U/S 188 IPC3 - EDA 51(B) DMA 2005 Disobedience of Dutys by public Servent

(B) Details about cases of conviction for criminal offences

Sl. NO.	Name of the Court & Date(s) of order(s)	Description of offence(s) & punishmentimposed	Maximum punishment imposed.
NA	Not Applicable	Not Applicable	Not Applicable

In the case of election to Council of States or election to Legislative Council byMLAs, mention the election concerned in place of name of constituency